క్లుప్తంగా

ప్రమాదకరంగా మలుపు



పొదలకూరు: పట్టణానికి సమీపంలోని సోమశిల మార్గం లింగంపల్లితోపు వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు యాక్సిడెంట్లకు గురవుతున్నారు. ఆర్అండ్బీ అధికారులు హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు ఆగలేదు. వాహన చోదకులు నిబంధనలు పాటించకపోవడమే కారణంగా తెలుస్తోంది.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాబు



పూండ్ల బాబు

కోవూరు: కోవూరు కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పూండ్ల బాబు (స్టాలిన్) నియమితులయ్యారు. ఈ క్రమంలో స్థానిక న్యాయవాదులు, పౌరసమాజ ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు స్టాలిన్‌కు బుధవారం అభినందనలు తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ముప్పు

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ తదితరులు

వెంకటాచలం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద గల వర్సిటీలో ఫ్రీడమ్ ఫ్రమ్ ప్లాస్టిక్ అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పెరిగితే భూసమృద్ధి తగ్గిపోవడంతో పాటు జలచరాలు, పక్షులు, వన్యప్రాణులు ప్రమాదంలో పడతాయని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ పాత్రలు, పేపర్, జూట్ బ్యాగులను వాడాలని సూచించారు. చిన్న చర్యలతో పెద్ద మార్పులు సాధ్యమవుతాయన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో విద్యార్థుల పాత్ర కీలకమని చెప్పారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపల్ వెంకట్రాయులు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 53.480 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 53.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత

నెల్లూరు సిటీ: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అమలు చేస్తూ ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలు కండీషన్‌లో ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, మందల వెంకటేష్, బాల సుధాకర్, డీఆర్వో విజయ్‌కుమార్, ఆర్డీఓ అనూష, తహసీల్దార్ షఫీమాలిక్, ఎలక్షన్ డీటీలు ఆషర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్‌ల చోరీ

నెల్లూరు సిటీ: వేర్వేరు ఘటనల్లో రెండు మోటారు సైకిళ్ల అపహరణపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ మండలంలోని దేవరపాళేనికి చెందిన గడ్డం వెంకటేశ్వర్లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన తన ఇంటి ముందు హోండా సీబీ జెడ్ బైక్‌ను పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రించాడు. ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- చింతారెడ్డిపాళేనికి చెందిన ఎ.శ్రీధర్ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మెడికవర్ హాస్పిటల్‌కు సమీపంలోని తన స్నేహితుడి గదిలో గత నెల 25వ తేదీన నిద్రించాడు. మరుసటిరోజు బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోకమాతా.. నమోస్తుతే

పొదలకూరు: పట్టణంలో కన్యకాపరమేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

⇨ మండలంలోని మరుపూరులో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. ప్రధానార్చకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారణలో దర్శనమిచ్చారు.

⇨ ఇనుకుర్తి కాంతమ్మ తల్లి ఆశ్రమంలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం చేశారు. తెల్లవారు జామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డి స్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంగపట్నంలో..

ఇందుకూరుపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా వేణుంబాక మహీధర్‌రెడ్డి– లావణ్య దంపతులు వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణ స్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద కోలాహలం నెలకొంది.

కొమరికలో..

శరన్నవరాత్రుల సందర్భంగా మండంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలక పోలేరమ్మకు బుధవారం అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

⇨ **మనుబోలు:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా పిడకల నరసారెడ్డి, కీర్తన దంపతులు వ్యవహరించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దేవీనవరాత్రుల సందర్భంగా మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో బుధవారం అమ్మవారు రక్తబీజవధ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



పొదలకూరు: మరుపూరులో అన్నపూర్ణగా..



మనుబోలు: అన్నపూర్ణాదేవి అలంకరణలో..



ఇందుకూరుపేట: ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ఇందుకూరుపేట: పల్లకిసేవలో అమ్మవారు



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొనసాగిన రక్తదాన శిబిరం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో జరుగుతున్న రక్తదాన శిబిరం రెండోరోజు కూడా కొనసాగింది. మొత్తం 196 మంది విద్యార్థులు బుధవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాదిలో ఇప్పటివరకు 714 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. కళాశాల ఏఓ కె.గిరీష్‌కుమార్, ఏపీఓ వై.ఫణి ప్రియకుమార్, ఎన్‌సీసీ కేర్ ఆఫీసర్ సీహెచ్ సతీష్, పీడీలు కె.బాలు, బి.సుప్రియ, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ ఎస్.వరప్రసాద్, హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ పి.శివప్రకాష్, సిబ్బంది ఎ.లక్ష్మీనారాయణ, టి.మంజునాథ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



రక్తదానం చేసిన అధ్యాపకులు, విద్యార్థులు

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ పి.మధుకుమార్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు లేఅవుట్లను ఆయన బుధవారం కమిషనర్ బాలకృష్ణతో కలసి పరిశీలించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, సర్వేయర్లకు ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాట్లు కలిగిన ప్రతిఒక్కరూ క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.



లేఅవుట్లను పరిశీలిస్తున్న టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ మధుకుమార్

పౌష్టికాహారంపై అవగాహన

వెంకటాచలం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కంటేపల్లి గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్వాడీ కార్యకర్తలు కామాక్షమ్మ, డి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

- **మనుబోలు:** పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని కట్టువపల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహార స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గేయపూజిత, అంగన్‌వాడీలు రమణమ్మ, రాధ, కల్పన, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో..

నగరానికి రూ.13.50 కోట్ల నిధులు

నెల్లూరు రూరల్: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా నెల్లూరు నగరానికి 2025 – 26 సంవత్సరానికి రూ.13.50 కోట్ల నిధులు మంజూరైనట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నిధుల వినియోగానికి సంబంధించి అమలు కమిటీ సమావేశాన్ని ఆయన చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మియావాకీ ప్లాంటేషన్‌తో నగరంలో పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తొలుత పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి, నెల్లూరుకు స్వచ్ఛమైన గాలి కోసం సమగ్ర కార్యాచరణను రూపొందించారన్నారు. వాయు కాలుష్య స్థాయిలను తగ్గించడానికి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడం కోసం సిటీ ఇంప్లిమెంటేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ నందన్, డీటీసీ చందర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పురుషులకు అదనంగా బస్సులు నడపండి

నెల్లూరు సిటీ: స్త్రీశక్తి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ఈ క్రమంలో నెల్లూరు–పామూరు మార్గంలో మగవారికి, వృద్ధుల సౌకర్యార్థం అదనంగా బస్సులు నడపాలని సంగంకు చెందిన సునీల్‌కుమార్ కోరారు. నెల్లూరు డిపో–1 మేనేజర్ వెంకటేశ్వర్లు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ఎనిమిది మంది ప్రయాణికులు తమ సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరుకు చెందిన సుజాత, రాఘవేంద్రలు ఉదయం తమ గ్రామం నుంచి మెయిన్‌రోడ్డుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కోవూరుకు చెందిన శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎస్ఆర్ బస్టాండ్ పక్కన బుచ్చిరెడ్డిపాళెం బస్సులు నిలిపే ప్రదేశంలో బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. పొదలకూరుకు చెందిన నారాయణ ఉదయం 9 గంటలకు నెల్లూరు నుంచి తమ ఊరికి పల్లెవెలుగు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ముద్దమూడికి చెందిన ఏడుకొండలు సాయంత్రం 5.15 నిమిషాల తరువాత తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, అదనపు సర్వీసులు కల్పించాలని కోరారు. రాజుపాళేనికి చెందిన ఆరిఫ్ మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ బస్సులు నార్తు రాజుపాళెం గ్రామం గుండా నడపాలని కోరారు. అలాగే సంగం నుంచి చేజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు.

జేసీని కలిసిన వీఆర్వో సంఘ నేతలు



నెల్లూరు(అర్బన్): నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఆయన చాంబర్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (వీఆర్వో అసోసియేషన్) నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు మొగళ్లూరు నాగేశ్వరరావు, వీఆర్వోలు రవి, శేఖర్, రాజేశ్వరి, విష్ణు, చైతన్య, జయరాజు, చిన్నారావు, మునిబాబు, రమణారావు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.345

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.345 ధర లభించింది. వేలానికి 1121 బేళ్లు రాగా, అందులో 815 బేళ్లను కొనుగోలు చేశారు, వేలం కిలో పొగాకు గరిష్టంగా రూ.345, కనిష్టంగా రూ.89, సగటున రూ.204.39 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

గ్రామాల్లో చెత్తను సేకరించాలి

- డీఎల్‌పీఓ రమణయ్య

పొదలకూరు: గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్స్ విధిగా ఇంటింటికీ వెళ్లి ట్రై సైకిళ్ల ద్వారా చెత్తను సేకరించాలని నెల్లూరు డీఎల్‌పీఓ పి.రమణయ్య అన్నారు. మండలంలోని కనుపర్తి గ్రామంలో చెత్త సేకరణను బుధవారం డీఎల్‌పీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మండలం, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులు చెత్త సేకరణను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ఇంటింటికీ చెత్తబుట్టలను అందజేయడం జరిగిందన్నారు. తగి, పొడి చెత్తను వేర్వేరుగా ప్రజలు బుట్టల్లో వేసి అందజేయాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ చెత్తసేకరణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ నీలమ తదితరులున్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

నాడు ముందుచూపు.. ప్రజలకు ప్రయోజనం

- బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.3.62 కోట్లు మంజూరు
- పెద్దవాగుపై జరుగుతున్న పనులు

పొదలకూరు: మండలంలోని నావూరు పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతేడాది ఎన్నికల ప్రక్రియలో భాగంగా పనులు నిలిచిపోయాయి. నేడు అధికారులు తిరిగి ప్రారంభించారు. చాలా ఏళ్లుగా వాగుపై బ్రిడ్జి నిర్మాణం చుట్టుపక్కల గ్రామాల ప్రజల కలగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3.62 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. సంగం మెయిన్ రోడ్డు నుంచి నావూరు మీదుగా చేజర్ల మండలం రెడ్డివారికండ్రిక వరకు సుమారు 20 కి.మీ దూరం రోడ్డు నిర్మాణ పనుల కోసం కూడా రూ.10.83 కోట్లను అప్పట్లో మంజూరు చేశారు. ఇటీవల పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు మరొక కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉండటంతో ఇప్పుడు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే వర్షాకాలం చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. వర్షాకాలం పెద్దవాగు చప్టాపై వరద ప్రవహించి గ్రామాలకు సంబంధాలు తెగిపోయేవి.



నావూరు పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు

కాకాణి శ్రద్ధ

కొన్ని దశాబ్దాలపాటు వంతెన చెక్కు చెదరకుండా ఉండేలా డిజైన్ చేశారు. చప్టాను అప్పటి ఆత్మకూరు ఎమ్మెల్యే సుందరరామిరెడ్డి చొరవతో నిర్మించారు. వంతెనను మాత్రం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి గత ప్రభుత్వంలో మంజూరు చేయించారు. బ్రిడ్జి పొడవు 79.46 మీటర్లు కాగా మొత్తం 12 వెంట్లు ఉన్నాయి. వాగుకు ఏ స్థాయిలో నీరు వచ్చినా తట్టుకునే విధంగా డిజైన్ చేసినట్టు ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. పైతట్టు ప్రాంతం నుంచి పెద్దవాగు ప్రవహిస్తుంది. భారీ వర్షాలు వస్తే వాగు చాలా వెడల్పు ప్రవహించి రాకపోకలు స్తంభించిపోతాయి. ఉధృతిని దృష్టిలో ఉంచుకుని వంతెనను నిర్మిస్తున్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

కొడవలూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు అన్నారు. 'స్వస్త్ నారీ – సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా నార్తురాజుపాళెంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి 48 మంది మహిళలకు ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మహిళలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం హిమజ, ఎంఎల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు బీపీ, షుగర్, కేన్సర్, టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పద్మజ, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, పలువురు ప్రత్యేక వైద్యాధికారులు పాల్గొన్నారు.



కొడవలూరు: మాట్లాడుతున్న వైద్యాధికారి బాలచంద్రబాబు

వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. వలంటీర్ల కృషి సమాజంలో చైతన్యం తీసుకొస్తుందని తెలియజేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సహకారం, సేవా భావన పెంపొందించడంలో సహాయకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట్రాయులు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.సాయినాథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో పాల్గొన్న వీసీ తదితరులు

ప్రసన్న చొరవ.. పురపాలక హోదా

- మేజర్ పంచాయతీ టు గ్రేడ్–2 మున్సిపాలిటీగా బుచ్చిరెడ్డిపాళెం
- గత ప్రభుత్వంలోనే అడుగులు
- వాస్తవాలు మరిచి.. అవాస్తవాలు ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని గ్రేడ్–2 మున్సిపాలిటీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో తామేదో చేసినట్లు టీడీపీ నాయకులు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతోనే నగర పంచాయతీ గ్రేడ్–2 మున్సిపాలిటీగా ఏర్పడిందని గొప్పలు చెప్పుకోవడం పట్టణ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. తాము చేయకపోయినా చేసినట్లు అవాస్తవాలను నిజాలుగా ప్రచారం చేసుకోవడం సరికాదని ప్రజలు అంటున్నారు.

వాస్తవ పరిస్థితులివి

2019 ఎన్నికలకు ముందు బుచ్చిరెడ్డిపాళెం మేజర్ పంచాయతీగా కొనసాగుతుండేది. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలిచిన వెంటనే మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా మార్పు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో 30 సంవత్సరాలుగా ఉన్న డిమాండ్‌ను ప్రసన్న నెరవేర్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బుచ్చిని నగర పంచాయతీగా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏళ్లనాటి ప్రజల కల నెరవేరింది. నగర పంచాయతీగా మారిన పట్టణంలో ప్రస్తుతం 20 వార్డులు ఉన్నాయి. జనాభా, వ్యాపారం, విద్య, వైద్యం తదితర విషయాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2020 నుంచి 2025 వరకు నగర పంచాయతీ ఆదాయ వివరాలను ప్రస్తుత ప్రభుత్వం సేకరించింది. దాదాపు రూ.3 కోట్లపైనే వార్షికాదాయం నగర పంచాయతీకి వివిధ పన్నులు, ప్రభుత్వ నిధుల ద్వారా చేకూరుతోంది. ఈ వివరాలన్నీ పరిశీలించిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నగర పంచాయతీకి ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ హోదా కల్పిస్తూ ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.



బుచ్చిరెడ్డిపాళెం పట్టణం

ప్రచారం మాత్రం ఇలా..

నగర పంచాయతీ ఆదాయం, జనాభా వృద్ధి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, వ్యవసాయం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో గ్రేడ్–2 మున్సిపాలిటీగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది తప్పితే టీడీపీ చేసిందేమీలేదు. తామేదే చేసినట్లు, తమ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కారణంగానే మున్సిపాలిటీగా మారిందని టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. సూపర్ సిక్స్‌కు తూట్లు పొడిచిన కూటమి ప్రభుత్వం తాము చేయని పనిని చేసినట్లు ప్రజలను మభ్యపెట్టడం సరికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ తీరు బాధాకరం



“ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో మేజర్ పంచాయతీగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీగా రూపుదిద్దుకుంది. నగర పంచాయతీకి వస్తున్న ఆదాయం, వనరుల లభ్యత ను దృష్టిలో ఉంచుకొని గ్రేడ్–2 మున్సిపాలిటీగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది టీడీపీ తమ గొప్పగా చెప్పుకోవడం బాధాకరం.

– షేక్ షాహుల్, వైఎస్సార్‌సీపీ బుచ్చి పట్టణ కన్వీనర్